ఓటు చాలెంజ్!

- ఓటు వేశాక సెల్ఫీ దిగి వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు
- ఓటర్లలో ఉత్సాహం నింపేలా వినూత్న కార్యక్రమాలు
- పోలింగ్ శాతం పెంచేందుకు కాలనీ సంఘాల చొరవ

సాక్షి, సిటీబ్యూరో: గ్రీన్ చాలెంజ్, బకెట్ చాలెంజ్ తరహాలోనే ఓటు చాలెంజ్‌కు కాలనీ సంఘాలు తెర లేపాయి. గ్రేటర్‌లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు, యువ ఓటర్లలో చైతన్యం నింపేందుకు యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ (యూ-ఎఫ్ఈఆర్‌డబ్ల్యూఏఎస్) పలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ప్రౌడ్ ఓటరు, ఫ్యామిలీతో సెల్ఫీ..అనే కార్యక్రమాలను చేపడుతున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి బీటీ శ్రీనివాస్ తెలిపారు. కుటుంబంతో కలిసి ఉదయమే ఓటు వేసి, సిరా చుక్కను చూపిస్తూ సెల్ఫీ దిగాలని, ఆయా ఫొటోలను కాలనీ సంఘాల వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయాలని సూచించారు. కాలనీలో ఇతరులకు ఓటు వేయాలని చాలెంజ్ చేయాలని తెలిపారు.



డివిజన్ స్థాయిలో వాట్సాప్ గ్రూప్‌లు..

నగరంలోని 4,800 కాలనీల్లో పోలింగ్ శాతం తక్కువగా ఉన్న ప్రాంతాలను ఎంచుకొని డివిజన్ స్థాయిలో వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో డివిజన్‌లో 800-900 మంది సభ్యులున్నారు. ఈనెల 30న పోలింగ్ రోజు ఉదయమే ఓటేశాక కుటుంబ సభ్యులంతా కలిసి వేలిపై సిరా చుక్కను చూపిస్తూ సెల్ఫీ దిగి కాలనీ వాట్సాప్ గ్రూప్‌లలో పెట్టాలని అసోసియేషన్ ప్రతినిధులు సూచించారు. ఆ రోజు ఎలాంటి పనులున్నా వాయిదా వేసుకోవాలని, వేడుకలకు హాజరవ్వాల్సి ఉంటే సమయాన్ని సర్దుబాటు చేసుకోవాలని సూచించారు. పోలింగ్‌కు ముందురోజు కాలనీ వాసులంతా సమూహంగా బూత్ వరకు ఈవినింగ్ వాక్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ప్రధానంగా 40-55 శాతం మాత్రమే పోలింగ్ నమోదైన కాలనీల్లో ఈసారి 60 శాతం కంటే ఎక్కువ ఓటింగ్ జరగాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

రిటర్నింగ్ అధికారి పులి సైదులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఈనెల 30న జరిగే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు పేర్కొన్నారు. మంగళవారం ఆల్వాల్ పరిధి లయోలా జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఎన్నికల మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్‌ను జిల్లా అడిషనల్ కలెక్టర్, రెవెన్యూ అధికారులతో కలిసి సైదులు పరిశీలించారు.



డిస్ట్రిబ్యూషన్ సామగ్రిని పరిశీలిస్తున్న పులి సైదులు

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

కుత్బుల్లాపూర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 48 గంటల ముందే ఎక్సైజ్ పోలీసులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని మద్యం, కల్లు దుకాణాలు, బార్లను మూసివేయించారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ భాస్కర్ హెచ్చరించారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

ఆలోచించి ఓటు వేయండి • బీఆర్‌ఎస్ అభ్యర్థి వివేకానంద్

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని డివిజన్లలో జోరుగా ప్రచారం



భాగ్యలక్ష్మి కాలనీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్



ర్యాలీలో పాల్గొన్న సుభాష్‌నగర్ కార్యకర్తలతో..

కుత్బుల్లాపూర్: అభివృద్ధి కావాలా.. భస్మాసుర హస్తం కావాలా అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ వివేకానంద్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిర్వహించిన ప్రచారంలో మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలతో అభయ హస్తం అంటూ ప్రజల్లో తిరుగుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులవి అభయ హస్తాలు కావని.. అవి భస్మాసుర హస్తాలని విమర్శించారు. ఆ చేతులు ఎవరి నెత్తిన పెడితే వారు భస్మమే అని ఎద్దేవా చేశారు. ప్రజలు ఈ భస్మాసురా హస్తం బారిన పడకుండా ఈనెల 30వ తేదీన కారు గుర్తుపై ఓటు వేయాలని కోరారు. బ్యాలెట్‌పై మూడో నంబర్‌పై ఉన్న కారు గుర్తుకు ఓటు వేసి మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

- **బీజేఆర్‌ఎలోకి కాంగ్రెస్ నేత పరశురామ్, లక్ష్మారెడ్డి..**

మంగళవారం చింతల్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు పరశురామ్ తన అనుచరులతో కలిసి మాజీ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు రియాజ్, ఖాదీర్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. శివానంద్ పటేల్, శివ, కటింగ్ షాప్ శివ, రాము, వీరేష్, అంజి, లక్ష్మణ్, రాజశేఖర్ తదితరులు పార్టీలో చేరారు.

- **బౌరంపేట్‌లో ఇంటింటి ప్రచారం..**

దుండిగల్ మున్సిపల్ బౌరంపేట్‌లో ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వివేకానంద్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ బాల్‌రెడ్డి, కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ధర్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్ డివిజన్‌లో జోరుగా ప్రచారం...

సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని వెంకటాద్రినగర్, కృష్ణానగర్ లేఔట్, సుభాష్‌నగర్ లాస్ట్ బస్టాప్, ఇబ్రహీం లేఔట్, గణేష్ గ్రౌండ్స్, సుభాష్‌నగర్ ఫేజ్-1, కుత్బుల్లాపూర్ మెయిన్ రోడ్, భాగ్యలక్ష్మికాలనీ, కృష్ణమూర్తినగర్, జేకేనగర్‌లలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని బస్తీలు, కాలనీలలో అభివృద్ధి పనులు చేపడుతూ అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించామన్నారు. ఈ సంక్షేమాన్ని ఇలాగే కొనసాగించేందుకు నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు.



బౌరంపేట్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు



కాంగ్రెస్ పార్టీ నాయకుడు పరశురామ్ బీఆర్‌ఎస్‌లో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

వివేకానంద్‌కు జామియత్ ఉలేమా-ఏ-హింద్ సంపూర్ణ మద్దతు



ఎమ్మెల్యే వివేకానంద్‌కు మద్దుతుగా సమావేశం నిర్వహించిన సంస్థ సభ్యులు

మైనారిటీ ప్రజల సంక్షేమం, అభ్యున్నతికి కృషి చేశారని పేర్కొంటూ ఎమ్మెల్యే వివేకానంద్‌కు జామియత్ ఉలేమా-ఏ-హింద్ సంస్థ తమ సంపూర్ణ మద్దతు తెలియజేసింది. మంగళవారం ఎమ్మెల్యేను కలిసి ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనారిటీల అభ్యున్నతి, సంక్షేమం కోసం మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్ల సంఖను పెంచామన్నారు. షాదీ ముబారక్, రంజాన్ తోఫా, విదేశాల్లో చదివే మైనార్టీ విద్యార్థుల కోసం రూ.20 లక్షలు స్కాలర్‌షిప్ వంటి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలుపరిచిన ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జామియత్ ఉలేమా-ఏ-హింద్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ షకీల్, మౌలానా అబ్రార్ అహ్మద్, ఉపాధ్యక్షుడు మౌలానాలు నయీమ్ సాబ్, సభ్యులు తాషారిక్ ఆలం, శంషాద్, అజారుద్దీన్ తదితరులు ఉన్నారు.



వివేకానంద్‌కు మద్దతు పత్రాన్ని అందజేస్తున్న జామియత్ ఉలేమా-ఏ-హింద్ సంస్థ సభ్యులు

సీనియర్ మహిళా కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు

నిజాంపేట్: మేడ్చల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ మహిళా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. డిసెంబరు 1వ తేదీ ఉదయం 10 గంటలకు బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమీలో ఎంపిక ఉంటుందన్నారు. 75 కిలోల లోపు బరువు ఉన్న మహిళలు హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన జట్టు సభ్యులు డిసెంబరు 4 నుంచి 7వ తేదీ వరకు నిజామాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నం. 73967 49998.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరయాంజాల్‌లోని చెన్నారెడ్డి చెరువు రోడ్డు సమీపంలో పొదల్లో ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉండటంతో స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సదరు వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. అతనికి సంబంధించిన ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతుడి ముఖంపై గాయాలున్నాయని పోలీసులు పేర్కొన్నారు. అనారోగ్యంతో మృతి చెందాడా లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి సంబంధీకులు ఉంటే ఫోన్ నం.8712568129 లేదా 8790477718లలో సంప్రదించాలని పోలీసులు కోరారు.

అతిక్రమిస్తే పోలీసుల్నీ వదలను

ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారం నడవాల్సిందే

- నగరంలో 666 క్రిటికల్ పోలింగ్ లొకేషన్ల గుర్తింపు
- ఓటర్ల భద్రతకు పూర్తి భరోసా: సిటీ సీపీ సందీప్ శాండిల్య



సాక్షి, సిటీబ్యూరో: 'నేను ప్రతి అంశాన్నీ నిబంధనలకు అనుగుణంగానే పరిగణనలోకి తీసుకుంటా. పోలీసు అధికారులు సహా ఎవరైనా వీటిని అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదు' అని నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య స్పష్టం చేశారు. పోలింగ్ నేపథ్యంలో తీసుకుంటున్న, ఇప్పటి వరకు చేపట్టిన చర్యలపై ఆయన మంగళవారం వీడియో సందేశం విడుదల చేశారు. అందులోని అంశాలు ఆయన మాటల్లోనే..

- నగరంలో ప్రశాంత వాతావరణం కోసం అన్ని స్థాయిలకు చెందిన పోలీసులు నిర్విరామంగా శ్రమించారు. దీనికి ప్రతిఫలంగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి. జిల్లాల్లో ఓటింగ్ శాతం ఎక్కువ ఉంటోంది. నగరంలో మాత్రం 40 నుంచి 50 శాతం మాత్రమే నమోదు అవుతోంది. పోలీసులు తమ విధులు నిర్వర్తించినట్లే ఓటర్లు ఓటు వేసి తమ విధి పక్కాగా నిర్వహించాలి. డ్రైవింగ్ లైసెన్సు, సరైన పత్రాలు, నిబంధనలకు తగ్గట్టు నెంబర్ ప్లేట్ లేని వాహనాలు పోలింగ్ రోజు తారసపడినా సీజ్ చేస్తాం.
- ఓటు వేయడానికి ఏ వాహనంపై వస్తున్నారో, దాని పత్రాలు, నెంబర్ ప్లేట్ పక్కాగా ఉండటంతో పాటు ఓటరు హెల్మెట్ ధరించడం కూడా కచ్చితం. ఈ నెల 9 నుంచి ఇప్పటి వరకు 2.5 లక్షల వాహనాలను తనిఖీ చేశాం. ప్రతి రోజూ సరైన పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని 20 నుంచి 25 వాహనాలను స్వాధీనం చేసుకున్నాం. ఎన్నికల ప్రక్రియ తర్వాతే వీటిని తిరిగి వస్తాం. నగరంలోని 31 ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహిస్తున్నాం. 40 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలు అదనంగా వచ్చాయి. ఇప్పటి వరకు నగర పోలీసులు రూ.63 కోట్ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నాం. 2400 నాన్ బెయిలబుల్ వారెంట్లు ఎగ్జిక్యూట్ చేయడంతో పెండెన్సీ లేదు. మినహాయింపులు పొందినవి మినహా అన్ని ఆయుధాలు డిపాజిట్ అయ్యాయి. నగరంలో 1600 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేశాం. ప్రతి రోజూ వీరిపై నిఘా ఉంచి కనీసం 600 మందిని వ్యక్తిగతంగా తనిఖీ చేస్తున్నాం.
- బుధ, గురువారాలు మాకు అత్యంత కీలకం. దానికి తగ్గట్టు పోలీసు విభాగం సమాయత్తమైంది. 1700 పోలింగ్ లోకేషన్స్ ఉన్న రెవెన్యూ మార్గాల పైనా ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. ఈ పోలింగ్ లోకేషన్స్‌లో 4915 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఇవన్నీ సీసీ కెమెరాల నిఘాలో ఉంటాయి. ఈ లోకేషన్లలో 666 క్రిటికల్‌గా నిర్ధారించాం. అక్కడ కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో గుమిగూడితే అదుపులోకి తీసుకుని పోలింగ్ తర్వాత వదిలి పెడతాం. ఓటు వేసిన వెంటనే మీ ఇళ్లకు వెళ్లి కుటుంబాలతో గడపండి. 21 మంది పరిశీలకులు సైతం సీసీ కెమెరాల్లోని దృశ్యాలను సమగ్రంగా అధ్యయనం చేస్తారు. బెదిరింపులు, హెచ్చరికలు, అమర్యాదగా మాట్లాడటం ఇలాంటి ఏ అంశాన్నీ పోలీసులు ఉపేక్షించరు. వీటికి పాల్పడిన వారిని తక్షణం అరెస్టు చేస్తారు. ఈ అంశంలో విఫలమైన అధికారుల పైనా చర్యలు ఉంటాయి. నగదు, మద్యం సహా ప్రలోభాల పంపిణీకి ప్రయత్నించినా కఠిన చర్యలు తీసుకుంటాం. నగరంలో ఉన్న అన్ని నియోజకవర్గాలను పరిగణలోకి తీసుకున్న బందోబస్తు, భద్రత ఏర్పాటు చేస్తున్నాం.



జగద్గిరిగుట్ట లాస్ట్‌బస్టాప్ వద్ద రోడ్‌షోలో పాల్గొన్న కొలన్ హన్మంతరెడ్డి



జగదిరిగుట్ట లాస్ట్‌బస్టాప్‌లో జరిగిన రోడ్‌షోలో మాట్లాడుతున్న కొలన్ హన్మంతరెడ్డి

హస్తం గుర్తుకు ఓటేసి గెలిపించాలి

కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి



జగద్గిరిగుట్టలో కాంగ్రెస్ పార్టీ ర్యాలీలో పాల్గొన్న మహిళలు



భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు పేద ప్రజలు జీవితాల్లో ఆనందాన్ని నింపనున్నాయని.. వచ్చే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. మంగళవారం జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో హన్మంతరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు గృహలక్ష్మి పథకం కింద రూ.3వేలతో పాటు వంట గ్యాస్‌ను రూ.500లకే అందిస్తామన్నారు.

- తొమ్మిదేళ్లుగా బీఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. తమ ప్రభుత్వం ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయనుందన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని హన్మంతరెడ్డి కోరారు. జగద్గిరిగుట్ట ప్రెసిడెంట్ గణేష్ , ఏసురత్నం, నరేందర్ రెడ్డి, వరమ్మతో పాటు కాంగ్రెస్ మరియు సీపీఐ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.
- భౌరంపేట ఇందిరమ్మ కాలనీని సందర్శించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్న హన్మంతరెడ్డి తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.
- కొలన్ హన్మంతరెడ్డికి మద్దతుగా సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పలో ఆటో ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో హన్మంతరెడ్డిని గెలిపించాలని కోరుతూ శ్రీనివాస్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో ప్రచారంలో పాల్గొన్న కార్యకర్తలు



నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పలో ప్రచారం చేస్తున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి



కొలన్ శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన పలువురు

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.





కొంపల్లిలో ప్రచార రథంపై నుంచి ప్రసంగిస్తున్న కూనశ్రీశైలంగౌడ్

కైసర్‌నగర్‌లో ప్రచారంలో ఓటర్లతో మాట్లాడుతున్న కూన

ఓటుతో ఆశీర్వదించండి.. బీజేపీని గెలిపించండి

కుత్బుల్లాపూర్ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్

- చివరి రోజు ప్రచారానికి బ్రహ్మరథం పట్టిన ప్రజలు
- కాలనీలు, బస్తీలు, గల్లీల్లో జోరుగా ప్రచారం
- కమలం గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థన



జగద్గిరిగుట్టలో నిర్వహించిన ర్యాలీలో భారీ సంఖ్యలో పాల్గొన్న బీజేపీ కార్యకర్తలు

కుత్బుల్లాపూర్: పదవిలో ఉన్నా.. లేకున్నా ప్రజల కోసమే పని చేశానని తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ప్రచారానికి మంగళవారం చివరి రోజు కావడంతో నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన నిర్వహించి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వివిధ బస్తీలు, కాలనీల్లో పర్యటించిన ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు.





శివాలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

◆ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకటవుతాయి...

ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్‌లో బీజేపీ ఓట్లు చీల్చేందుకే బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు డ్రామాలు ఆడుతున్నారని అన్నారు. ఎన్నికలయ్యాక బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒకటవుతాయని పేర్కొన్నారు. కమలం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ప్రజలను కోరారు.

◆ గెలిపిస్తే కొంపల్లిలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తా..

కొంపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కూన శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు. తనను గెలిపిస్తే 30 రోజుల్లోనే కొంపల్లిలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, రాజిరెడ్డి, జనార్దన్ రెడ్డి, జీవన్ రెడ్డి ఉదయ్, సతీష్ సాగర్, శివాజీ రాజా శంకర్ నాయక్, రాజశేఖర్ రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.



జగద్గిరిగుట్టలో ప్రచారంలో భాగంగా పాదయాత్ర చేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

◆ జీడిమెట్ల డివిజన్‌లో ఇంటింటి ప్రచారం..

జీడిమెట్ల డివిజన్‌లోని మీనాక్షి ఎస్టేట్, స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీ, ప్రాగా కాలనీ, జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని బీరప్ప, నగర్, సంజయ్ పురి కాలనీ, దేవమ్మ బస్తీ కాలనీలలో కూన శ్రీశైలంగౌడ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బ్యాలెట్‌లో కమలం గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరుతున్న కూన



బైక్ ర్యాలీలో యువకులతో మధు



బైక్ ర్యాలీలో భారీగా పాల్గొన్న బీజేపీ, జనసేన నాయకులు



కుత్బుల్లాపూర్ హమాలీ వర్కర్స్ యూనియన్ సభ్యులతో కూన

తలసీమియా రోగులకు రక్తం కొరత

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుతం ఓ వైపు ఎన్నికల సందడి కొనసాగుతోంది. దీని కారణంగా బ్లడ్ బ్యాంకులు, హాస్పిటల్స్‌లో తీవ్రమైన రక్తనిల్వల కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో తలసేమియా సికిల్ సెల్ సొసైటీ (టిఎస్సిఎస్)సెక్రటరీ డాక్టర్ సుమన్ జైన్ ఓ ప్రకటనలో రక్తదానం కోసం దాతలకు అత్యవసర విజ్ఞప్తి చేశారు. తలసీమియా రోగులు, వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రమం తప్పకుండా రక్తమార్పిడిపై ఆధారపడతారనీ, ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా రక్త లభ్యత తగ్గిపోయి రోగులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ రోగుల వినియోగార్థం సాధారణంగా 600–700 యూనిట్ల రక్తం అవసరం కాగా ఇప్పుడు కేవలం 100 యూనిట్ల రక్తం మాత్రమే అందుబాటులో ఉందన్నారు, మరీ ముఖ్యంగా కొన్ని బ్లడ్ గ్రూపులు పూర్తిగా అందుబాటులో లేవని, ఆసుపత్రులు బ్లడ్ బ్యాంకులు దగ్గర రక్తదానం బాగా తగ్గిపోయిందని వెల్లడించారు.. ఇది తలసేమియాతో బాధపడుతున్న వారి జీవితాలను ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తోందన్నారు. గతంలోని నిల్వ చేసిన రక్తాన్ని దాదాపుగా వినియోగించేశామని చెప్పారు, ఇదే పరిస్థితి కొనసాగితే తలసేమియా రోగుల జీవితాలు మరింత దుర్భరంగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు.